క్లుప్తంగా

బీరన్న బోనాలు



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కోనాపురంలో బీరన్న బోనాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం ఆరంభం సందర్భంగా కురుమ కులస్తులు తమ ఇలవేల్పు అయిన బీరన్నకు తొలిబోనం సమర్పించారు. తొలుత డప్పుచప్పుళ్లతో ఆలయానికి బోనాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు కోరె ప్రభాకర్, పోతరాజు వీరస్వామి, యూత్ అధ్యక్షుడు ఈర నవీన్, ఉపాధ్యక్షులు పోతరాజు రాజు, సురేశ్, హరీశ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



రాయపర్తి : మండలంలోని కొండాపురంలో గ్రామ గౌడ కుల సహకార సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తేరాల సదానందం, ఉపాధ్యక్షుడిగా జక్కుల కుమారస్వామి, కార్యదర్శిగా మేడి కుమారస్వామి, సభ్యులుగా దొమ్మటి రామ్మూర్తి, చిర్ర శ్రీనివాస్, బండారి లక్ష్మణ్, తేరాల యాకయ్య, పెదగోని శేషయ్య, కోల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని గౌడ కులస్తులు, సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

'ఎర్రబెల్లి వ్యాఖ్యలు సరికాదు'

వర్ధన్నపేట : వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, సీఎం రేవంత్‌రెడ్డిలపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మరుపట్ల అరుణ సాయి అన్నారు. పట్టణంలో మహిళా ముఖ్యనాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నకిలీ సర్వేల పేరుతో ఎమ్మెల్యే నాగరాజుపై ప్రజావ్యతిరేకత ఉందని ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు చేయడం తోపాటు ఎమ్మెల్యేలు, మంత్రులు సీఎం మాట వినడం లేదన్న వ్యాఖ్యల్లో ఇసుమంతైనా నిజం లేదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్లడంతోపాటు ప్రజల కష్టసుఖాల్లో నిత్యం పాలుపంచుకుంటున్న ఎమ్మెల్యే నాగరాజుపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మళ్లీ ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

7న ఆవిర్భావ వేడుకలు



దుగ్గొండి : ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసి విజయం సాధించిన నేపథ్యంలో ఈనెల 7న ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం దేశంలో చరిత్ర సృష్టించిందని తెలిపారు. గ్రామాల్లోనూ జెండా ఎగరేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మామునూరి శ్రీధర్, మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, నాయకులు బొట్ల ప్రతాప్, కొలగాని రవి, పర్లపెల్లి యుగంధర్, కమలాకర్, ఆనంద్, నల్లబెల్లి గణేశ్, రమేశ్, ప్రశాంత్, ఎలీషా, అఖిల్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన ఐత ఎల్లమ్మ ఇంట్లో జారిపడి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు వైద్యం కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం రూ.10 వేల సాయం అందించారు. తొలుత ఆమెను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు కక్ర రవీందర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, గారె నర్సయ్య, ఐత రాంచందర్, ముద్రబోయిన సుధాకర్, పోగులకొండ వేణు, యూసుఫ్, సంకినేని ఎల్లస్వామి, చిలువేరు సాయి, సింహాద్రి, పెద్దగోని జీవన్, పీరని రవి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడ : సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కుశ కుమార్ సూచించారు. మండలంలోని పొగుళ్లపల్లి ఏకలవ్య గురుకుల జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం పోలీస్ కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు.

యథేచ్ఛగా గుడుంబా దందా

- మండల కేంద్రంలో పొట్లాల్లో విక్రయాలు

సంగెం : మండలంలో గుడుంబా తయారీ యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని గ్రామాల్లో, తండాల్లో గుడుంబా తయారు చేస్తున్నట్టు తెలుస్తోంది. వరంగల్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండడంతో తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నట్టు సమాచారం. మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు పలువురు బహిరంగంగానే మండిపడుతున్నారు. ప్రతినెలా మామూళ్లు తీసుకుంటూ ఎక్సైజ్ అధికారులు అప్పుడప్పుడు నామమాత్రంగా దాడులు నిర్వహిస్తూ ఎక్కువ మొత్తంలో గుడుంబా, పానకం, నల్లబెల్లం, పటిక దొరికినా రికార్డుల్లో తక్కువగా చూపిస్తూ, నిందితులు పారిపోయినట్టు పేర్కొంటూ చేతులు దులుపుకుంటున్నట్టు విశ్వసనీయ వర్గాల భోగట్టా.

మండల కేంద్రంలో భారీగా అమ్మకాలు

మారుమూల తండాల్లోనే కాకుండా మండల కేంద్రంలోనూ గుడుంబా తయారీ, అమ్మకాలు భారీగా సాగుతున్నట్టు కనపడుతోంది. ప్లాస్టిక్ కవర్లలో గుడుంబాను అమ్ముతుండడంతో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట చెత్త ట్రాక్టర్ నిలిపే చోట నిత్యం వందల సంఖ్యలో గుడుంబా తాగి పడేసిన కవర్లు దర్శనమిస్తున్నాయి. ఇటీవల దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులపై ఓ తండాలో గుడుంబా తయారీ, విక్రేతలు తిరగబడిన ఘటన వారికున్న రాజకీయ మద్దతుకు అద్దం పడుతోంది.



తయారు చేస్తున్న గుడుంబా

మత్తుకు బానిసలవుతున్న యువకులు

పలు గ్రామాల్లో గుడుంబాకు బానిసలుగా మారి పలువురు యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, వస్తువులు సైతం అమ్ముకుంటూ గుడుంబా సేవిస్తున్నారని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు ఆరోగ్యం క్షీణించి మృత్యువాత పడిన ఘటనలూ కోకొల్లలు. కుటుంబాలు సైతం వీధిన పడుతున్న దుస్థితి నెలకొంది. ఇకనైనా అధికారులు మండలంలో గుడుంబా తయారీ, అమ్మకాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సంగెంలో తాగి పడేసిన గుడుంబా పొట్లాలు

నిర్మూలనకు చొరవ చూపుతున్నాం

మండలంలో గుడుంబా నిర్మూలనకు చొరవ చూపుతున్నాం. నిత్యం రూట్ వాచ్, తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్నాం. మొదటి సారి పట్టుబడిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నాం. మళ్లీ పట్టుబడితే జరిమానాతోపాటుగా కఠిన శిక్షలు తప్పవు.

\- సరిత, ఎస్సై, ఎక్సైజ్ శాఖ

ఎంఎంఆర్ నిధులతో రోడ్ల నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి : మండలంలో ఎంఎంఆర్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని మేడపల్లి, గుండ్లపహాడ్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్ల నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఇజ్జగిరితో కలిసి గురువారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రూ.6 కోట్ల నిధులతో మేడపల్లి క్రాస్‌లోని జాతీయ రహదారి నుంచి మేడపల్లి వరకు 7 మీటర్ల వెడల్పుతో, రూ.90 లక్షలతో రుద్రగూడెం క్రాస్ రోడ్డు నుంచి గుండ్లపహాడ్ గోదాంల వరకు 5.5 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్లు నిర్మిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీఆర్ డీఈ శ్రీకాంత్‌రెడ్డి, ఏఈ రజినీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి మాలోత్ చరణ్ సింగ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేశ్, నాయకులు ఆంగోత్ ఫూల్‌సింగ్, జిల్లా మునేందర్, కాసం మధు, శ్రీనివాస్, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ రమేశ్

పర్వతగిరి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగరేసి సత్తా చాటాలని బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ జోరిక రమేశ్ కోరారు. మండలంలోని కొంకపాక, చౌటపల్లి, అన్నారం, మాల్యాతండా ఎంపీటీసీ స్థానం పరిధిలోని మూడెత్తులతండా, హట్యాతండా, రావూరు, దూపతండా, పెద్దతండాల్లో గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావుతో కలిసి రమేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడచినా అభివృద్ధి చేయలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మాత్రమే అభివృద్ధి జరిగిందని చెప్పారు. హామీలు నెరవేర్చలేక సీఎం దిగజారుడు మాటలు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. సమావేశాల్లో పర్వతగిరి సొసైటీ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, చౌటపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్ బుద్దె వెంకన్న, మాజీ జెడ్పీటీసీలు లూనావత్ పంతులు, చిన్నపాక శ్రీనివాస్, మండల ఎన్నికల ఇన్‌చార్జ్‌లు హరికృష్ణ, ఆదామ్, సుభాశ్, మధుకర్, గంధం బాలరాజు, చింతల శ్రీనివాస్, భానోతు వెంకన్న, బాబు, పిట్టల రాజు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరయ్య

నెక్కొండ : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విఫలమయ్యారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, మాజీ ఎంపీపీ జాటోతు రమేశ్‌నాయక్ విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా మండలంలో అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విడుదలైన రూ.32.56 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను మళ్లించి గిరిజన అభివృద్ధిని అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హడావుడిలా పనులు చేపట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి నిర్లక్ష్యంతో నిధులు మంజూరు కాక నియోజకవర్గం వెనుకబాటుకు గురవుతోందని ఆందోళన వెలిబుచ్చారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు చేపట్టి తాము మంజూరు చేయించినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మండల అభివృద్ధి, మున్సిపాలిటీగా ఉన్నతీకరణపై కాంగ్రెస్ నాయకులను నిలదీస్తామని చెప్పారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు కొమ్ము రమేశ్, మాజీ ఎంపీపీ దొనికెన సారంగపాణి, పట్టణ అధ్యక్షుడు కొనిజేటి భిక్షపతి, నాయకులు గుంటుక సోమయ్య, గాదె భద్రయ్య, మాదాసు రవి, లావుడ్య హరికిషన్, సాంబయ్య, కారింగుల సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూరయ్య

త్వరగా హైలెవల్ వంతెన నిర్మించాలి

- బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు నర్సింగం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల హైలెవల్ వంతెన త్వరితగతిన నిర్మించాలని బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నపెల్లి నర్సింగం, నాయకుడు మోటూరి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురిజాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడార. గురిజాలలో పెద్దం చెరువు వద్ద హైలెవల్ బ్రిడ్జిని గత బీఆర్ఎస్ హయాంలో నాటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంజూరు చేయించారని, టెండర్ ప్రక్రియ సైతం పూర్తి అయ్యిందని చెప్పారు. వెంటనే గురిజాల హైలెవల్ వంతెన పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

నిధుల మంజూరుపై హర్షం

గురిజాల హైలెవల్ వంతెనకు రూ.3.20 కోట్ల నిధులతో శంకుస్థాపన చేయడం పట్ల గురిజాల ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గొలనగొండ వేణు, ప్రధాన కార్యదర్శి చుక్క రాజేందర్ గౌడ్ మాట్లాడారు. గురిజాలలోని పెద్ద చెరువు మత్తడి పోసినప్పుడు వరద ఉధృతికి మహేశ్వరం క్రాస్ రోడ్డు–గురిజాల ప్రధాన రహదారి లోలెవల్ బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిందని చెప్పారు. వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. చెరువు మత్తడి పోసిన సందర్భాల్లో రాకపోకలు బంద్ అవుతున్నాయని వివరించారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతోపాటు పనులు ప్రారంభించడంతోపాటు గురిజాల నుంచి కోనాపురం వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.3.10 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగం

బాల్యవివాహాలను అరికట్టాలి

గూడూరు : సమాజంలో నేటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని అరవింద విద్యాలయంలో గురువారం ఆరోగ్యమిత్ర స్వచ్ఛంధ సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా కృష్ణమూర్తి అధ్యక్షతన బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం బాల్య వివాహాలను నిరోధించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యాలయ కరస్పాండెంట్ పింగిళి శ్రీనివాస్, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, పగిడిపాటి ప్రసాద్, ఋషికేష్ పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ నాయకుడి మృతి

కొత్తగూడ : మండల కేంద్రానికి చెందిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు యాదగిరి యుగేందర్(65) బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి నాయకులు నివాళులర్పించారు.

సన్మానం

ఐనవోలు : భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ మెంబర్‌గా నూతనంగా నియామకమైన మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావును బీజేపీ మండల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మారావును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్, ప్రధాన కార్యదర్శి రాజు, సీనియర్ నాయకులు భాస్కర్, వెంకటనారాయణ, ప్రభాకర్, విక్రమ్, కిరణ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలలో ఉచిత విద్యతో పాటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో నూతనంగా సైన్స్ గ్రూప్‌లు మంజూరయ్యాయని, విద్యార్థులు సైన్స్ గ్రూపుల్లో చేరి ఉచిత విద్యను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



సంగెం : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు లారీ యూరియా లోడ్ రావడంతో రైతులు గురువారం బారులు తీరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి యూరియా కోసం ఎదురు చూస్తున్న మండల రైతులకు కొంత ఊరట లభించిందని చెప్పక తప్పదు. సంగెంతోపాటు కుంటపల్లి, గాంధీనగర్, కొత్తగూడెం, తిమ్మాపురం తదితర గ్రామాల రైతులు యూరియా కోసం సొసైటీకి చేరుకుని క్యూ కట్టారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకున్నా ఒక్కో రైతుకు ఒకటి, రెండు చొప్పున మాత్రమే యూరియా బస్తాలు ఇవ్వడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రభుత్వం వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజలు నిలదీస్తారనే శంకుస్థాపనలు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజలు నిలదీస్తారనే హడావుడిగా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నర్సంపేటలోని సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఆ పార్టీ నాయకులు, కార్యర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని విస్మరించి మోసపూరిత హామీలతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. గతంలో తాను మంజూరు చేయించిన నిధులతోనే నియోజకవర్గంలో బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అన్ని రోడ్ల పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ నాయకులు దందా చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో శ్రమించిన నాయకులను, కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపిస్తానని చెప్పారు. మేజర్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసిన కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం ముత్యాలమ్మతండా, చంద్రయ్యపల్లి, గురిజాలకు చెందిన పలు కుటుంబాలు వివిధ పార్టీలకు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరాయి. పార్టీలో చేరిన వారిలో సుదర్శన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహ రాములు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మోతె జయపాల్‌రెడ్డి, గోపు జయపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, వల్లాల కరుణాకర్, తాళ్లపెల్లి రాంప్రసాద్, మోటూరి రవి, కొడారి రవి, భూక్య వీరన్న, బండారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కత్తిమీద 'సాగు'

- ముఖం చాటేసిన వరుణుడు
- వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపులు



నారుమడులు లేక వెలవెలబోతున్న పొలాలు



నీటి నిల్వలు లేక ఎండిపోయిన చెరువు

ఐనవోలు : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు అవుతున్నా వరుణుడు ఆశించిన మేర కరుణించకపోవడంతో రైతులకు పంటసాగు సవాల్‌గా మారింది. దీంతో మండల వ్యాప్తంగా సాగుచేసిన పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. గతేడాది యాసంగి సీజన్‌లో భూగర్భ జలాలు అనూహ్యంగా అడుగంటడంతో అనేక మంది రైతుల పొలాలు ఎండిపోయాయి. ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ మొదలైనప్పటి నుంచి ఆశించిన మేర వర్షాలు కురవడం లేదు. ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాల కారణంగా మెట్ట పంటల రైతులు కాస్తంత ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోతే మెట్ట భూమిలో సాగుచేసే పంటలైన పత్తి, మొక్కజొన్న కూడా దెబ్బతిని ఆశించిన మేర దిగుబడులు రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ఒక్క భారీ వర్షం కురవకపోవడంతో మండలంలోని చెరువులు, కుంటల్లో నీళ్ల లేక దయనీయ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అయితే బోరు, బావుల కింద సాగు చేసే రైతులు మాత్రం నారుమడులు సిద్ధం చేసి వరినారు అలికారు. కొద్దిమంది రైతులు రోహిణి కార్తెలో నారు పోసుకోగా నారు సిద్ధమైంది. చెరువుల్లో, కుంటల్లో నీరు చేరితే బోరు, బావుల్లో నీరు పెరిగే అవకాశం ఉంటుందని వర్షాల కోసం ఎదురు చూస్తున్నామని రైతులు తెలిపారు.

అంతంత మాత్రంగానే బోర్లు

మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీల్లో సుమారు 11 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే ఇందులో సుమారు 70 శాతంకు పైగా వరిసాగు చెరువులు, కుంటలపై ఆధారపడి సాగవుతుంది. ఆశించిన మేర సాధారణ వర్షపాతం నమోదు కాకపోతే బోర్లు, బావుల్లో నీరు అంతంత మాత్రంగానే ఉండే అవకాశం ఉంది. ఇలా జరిగితే వరిసాగు కష్టంగా మారే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

17 గ్రామాల్లో 93 చెరువులు, కుంటలు

జూన్ నెలలో సమృద్ధిగా వర్షాలు కురిస్తే చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంది. కాగా జూన్ నెలలో మండలంలో 133.7 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కేవలం 60.6 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసినట్లు అధికారులు తెలిపారు. లోటు వర్షపాతం కారణంగా మండల వ్యాప్తంగా ఉన్న 93 చెరువులు, కుంటలు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి. వరిసాగులో చెరువుల, కుంటలతో పాటు ఆకేరు వాగు కూడా ప్రధాన భూమిక పోషిస్తుంది. భూగర్భ జలాలు అడుగంటుతుండగా సరైన వర్షాలు కురిసి వాగులు, వంకలు పొర్లితేనే వరిసాగు ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

వర్షాలు కురుస్తేనే సాగు సాధ్యం



నాకు కొండపర్తి గ్రామంలోని ఊర చెరువుకింద మూడు ఎకరాలు, కొచ్చెరువు కింద ఎకరం పొలం ఉంది. చెరువుల్లోకి నీరు వస్తేనే పంట సాగయ్యేది. సాధారణంగా జూన్ నెలలో నారుమడి సిద్ధం చేసుకుని జూలైలో నాటు వేసేవాడిని. ఇప్పటి వరకు వర్షాలు కురవకపోవడంతో నారుమడి కూడా సిద్ధం చేయలేదు.

\- కంజర్ల సంపత్‌రావు, రైతు, కొండపర్తి

కౌలుకు తీసుకుని సన్నాల సాగు



రెండు ఎకరాల పొలం కదారి చెరువు కింద కౌలుకు తీసుకున్నాను. తినే బియ్యం కోసం సన్నధాన్యం సాగు చేశాను. నీటి వసతి లేకపోవడంతో చెరువు పారకం ద్వారానే సాగు చేస్తున్నాను. వర్షాలు లేక పోవడంతో నారుమడి సిద్ధం చేసుకోలేదు. వర్షాల కోసం ఎదురు చూస్తున్నాను. వర్షాలు పడకపోతే నష్టం తప్పేలా లేదు.

\-బండి శ్రీనివాస్, రైతు, పంథిని

'ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలను అరికట్టండి'

నర్సంపేట : ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల అక్రమాలను అరికట్టాలని కోరుతూ ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయ ఏఓకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నాగరాజు మాట్లాడారు. పట్టణంలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు విక్రయిస్తున్నారని తెలిపారు. ఎంఈఓకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు